నమస్తే తెలంగాణ
# వికారాబాద్
హైదరాబాద్, ఆదివారం 18 మే 2025 | VIKARABAD

## గ్రేటర్‌కు వర్ష సూచన



సిటీబ్యూరో, మే 17 (నమస్తే తెలంగాణ): ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల రెండు రోజుల్లో గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో ఉరు ములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా ద్రోణి, ఆవ ర్తనం ప్రభావంతో నగరంలో ఉష్ణోగ్రతలు తగ్గు ముఖం పట్టాయి. శనివారం నగరంలో గరిష్ఠ ఉష్ణో గ్రత 34.1 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 25.2 డిగ్రీలు, గాలిలో తేమ 50 శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

# కడుపు మండి.. రోడ్డెక్కి..

- ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ అన్నదాతల ఆగ్రహం
- కులకచర్ల పెద్ద గేట్ చౌరస్తాలో కుస్మసముద్రం రైతుల ధర్నా
- అనంతరం కులకచర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ..
- సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పణ



ధాన్యాన్ని కాంటా చేయాలంటూ కులకచర్ల పెద్ద గేట్ చౌరస్తాలో కుస్మసముద్రం రైతుల ధర్నా

కులకచర్ల, మే 17 : ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా చేపట్టకపోవడంతో కడుపుమండిన అన్నదాతలు రోడ్డెక్కారు. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ప్రతి గ్రామంలోనూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి రైతుకూ ప్రభుత్వ మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకుంటే.. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ మాత్రం అన్నదాతలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై నెల రోజులవుతున్నా సక్రమంగా కొనుగోళ్లు జరగడంలేదు. అన్నదాతలు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే పలు కొర్రీలు పెడుతూ కాంటా చేయడం లేదు. దీంతో రైతులు రోజుల తరబడిగా అక్కడే నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొన్నది. కొనుగోలు కేంద్రం నిర్వాహకుల తీరును నిరసిస్తూ మండలంలోని కుస్మసముద్రం గ్రామానికి చెందిన పలువురు రైతులు తమ ధాన్యాన్ని వెంటనే కాంటా చేయాలని కులకచర్ల పెద్ద గేట్ చౌరస్తాలో ధర్నా నిర్వహించి.. అనంతరం కులకచర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి.. సమస్యను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రాన్ని అందించారు. తమ గ్రామంలో ఆలస్యంగా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారని, అది ఏర్పాటైన పది రోజులవుతున్నా కేవలం ఒక్క లారీ వడ్లను మాత్రమే రైస్‌మిల్లును పంపించారని.. కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన వడ్లను ఇంకా కొనడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### అందని గన్నీ బ్యాగులు..

కుస్మసముద్రం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేం ద్రాన్ని ఏర్పాటు చేయగా.. అక్కడి నిర్వాహకుల తీరుతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన 1500 గన్నీ బ్యాగులను రైతులకు పంపిణీ చేశారు. అయితే, గ్రామంలో పంట పెద్ద మొత్తంలో రావడంతో అన్నదాతలు కల్లాలు, రోడ్ల పక్కన ఆరబెట్టారు. వాటిని కేంద్రానికి తీసుకొచ్చేందుకు సంచులను సరఫరా చేయాల్సి ఉంది. కానీ, ప్రస్తుతం సంచుల స్టాకు తమ దగ్గర లేదని.. జిల్లా నుంచి వచ్చిన తర్వాతే ఇస్తామని.. అప్పటివరకు కేంద్రానికి వడ్లను తీసుకు రావొద్దని సూచిస్తున్నారని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కల్లాలు, రోడ్ల పక్కన ఆరబెట్టిన వడ్లు అకాల వర్షానికి తడిచిపోతే మొలకలు వస్తాయని.. తమకు తీవ్ర నష్టం వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### లారీలు రాక.. పేరుకుపోతున్న నిల్వలు..

మండలంలోని పలు కొనుగోలు కేంద్రాలకు లారీలు సక్రమంగా రాకపోవడంతో కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. దీంతో కేంద్రాల నిర్వాహకులు కాంటా అయిన వడ్లు రైస్ మిల్లులకు తరలిన తర్వాతే రైతుల నుంచి ధాన్యాన్ని సేకరిస్తామంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న నిర్లక్ష్యాన్ని అరికట్టాలని రైతులు పేర్కొంటున్నారు.



కుస్మసముద్రం కేంద్రానికి కాంటా కోసం రైతులు తీసుకొచ్చిన వడ్లు

### గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదు



ధాన్యాన్ని పొలాల్లోనే నిల్వ చేశా. గన్నీ బ్యాగుల కోసం కొనుగోలు కేం ద్రానికి వెళితే తమ దగ్గర స్టాక్ లేదని.. వచ్చిన తర్వాతే ఇస్తామని అక్కడి నిర్వాహకులు చెబుతున్నారు. గన్నీ బ్యాగులు ఇవ్వకుంటే కేంద్రానికి ధాన్యాన్ని ఎలా తీసుకురావాలి. పొలాల్లోనే వడ్లను ఉంచితే అకాల వర్షానికి తడిచిపోయే ప్రమాదం ఉన్నది. అధికారులు స్పందించి గన్నీ బ్యాగులు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలి.

**-డి శ్రీశైలం, రైతు కుస్మసముద్రం, కులకచర్ల**

### అధికారులు స్పందించాలి



కుస్మసముద్రం గ్రామంలో వారం రోజుల కిందటే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేవలం ఒక్క లారీ లోడ్‌ను మాత్రమే రైస్‌మిల్లును పంపించారు. తమ ధాన్యాన్ని తూకం వేయాలని కేంద్రం నిర్వాహకులను కోరితే.. ఇప్పటికే వడ్ల నిల్వలు ఉన్నాయి. అవి రైస్‌మిల్లులకు తరలిన తర్వాతే తీసుకురావాలని చెబుతున్నారు. వడ్లను పొలాల్లో ఉంచితే వర్షం వస్తే తడిచిపోతాయి. అధికారులు స్పందించి లారీలు సక్రమంగా కొనుగోలు కేంద్రానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

**-డి చెన్నయ్య, రైతు కుస్మసముద్రం, కులకచర్ల**

### వానకు తడిస్తే.. మొలకొస్తాయి..



ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చేందుకు అక్కడి నిర్వాహకులు గన్నీ బ్యాగులు ఇవ్వడంలేదు. తమ వద్ద స్టాక్ లేదని.. వచ్చిన తర్వాత ఇస్తామంటున్నారు. అకాల వర్షాలతో వడ్లు తడిస్తే చాలా ఇబ్బంది అవుతుంది. అధికారులు స్పందించి గన్నీ బ్యాగులను సకాలంలో పంపించి.. అన్నదాతలను ఆదుకోవాలి.

**-హేమ్లీబాయి, మహిళా రైతు కుస్మసముద్రం తండా, కులకచర్ల**

# రోజుల తరబడి ఎదురుచూపులే..

చేవెళ్ల రూరల్ : మోకిల ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో పొలాల వద్దనే కాంటాలు చేసి కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకొచ్చేవారు. ప్రస్తుతం అలా కాకుండా నేరుగా కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని యంత్రం ద్వారా తాలు తొలగించి తీసుకుంటున్నారు. దీంతో సమయం వృథా అవుతున్నదని, గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నదని అన్నదాతలు పేర్కొంటున్నారు.

### ఇబ్బందుల్లో పక్క మండలాల రైతులు

మోకిలలో ఒకటే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పక్క మండలాల రైతులకు రవాణా భారం అధికం అమవుతున్నది. దీంతో కొందరు రైతులు దళారులకే తక్కువ ధరకు తమ ధాన్యాన్ని విక్రయించి నష్టపోతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే రోజుల తరబడి వేసి ఉండాల్సిన పరిస్థితి నెలకొనడంతో వ్యాపారులకు అమ్మితేనే బెటర్ అని అనుకుంటున్నారు.



వడ్ల తాలు తొలగిస్తున్న యంత్రం



మోకిలలోని ధాన్యం కొనుగోలు కేంద్రం

### చేవెళ్లలో ఏర్పాటు చేస్తే బాగుండేది..



మోకిలలోని కొనుగోలు కేంద్రానికి రావడం చాలా ఇబ్బందిగా ఉన్నది. చేవెళ్లలోనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే మాకు అనువుగా ఉండేది. ఇంత దూరం తీసుకు రావాలంటే రవాణా ఖర్చులు పెరుగుతున్నాయి. కూలీలూ దొరకడం లేదు. **- సుభాశ్‌గౌడ్, రైతు, ఈర్లపల్లి గ్రామం, చేవెళ్ల మండలం**

### గతంలో కొనుగోళ్లు త్వరగా జరిగాయి



గతంలో ధాన్యం కొనుగోళ్లు తొందరగా జరిగేవి. ప్రస్తుతం చాలా ఆలస్యం అవుతున్నాయి. అంతేకాకుండా యంత్రంతో తాలు తొలగించాకే కేంద్రాల నిర్వాహకులు వడ్లను కొంటున్నారు. దీంతో గంటలు, రోజుల తరబడి కొనుగోలు కేంద్రం వద్దే ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది.

**- భూపాల్‌రెడ్డి, రైతు, చందిప్ప, శంకర్‌పల్లి**

### రైతుల బాధలు పట్టించుకోవాలి..



కొనుగోలు కేంద్రం వద్ద నిరీక్షణతో చాలా ఇబ్బందిగా మారింది. దళారులకు అమ్ముకుంటే నాలుగు రూపాయలు తక్కువ వస్తయేమో కానీ.. ఎదురుచూపులు మాత్రం ఉండదు. కేంద్రం వద్ద పది రోజులుగా వెయిట్ చేస్తేనే ఈరోజు మా టోకెన్ వచ్చింది. ఇంకా మా పని పూర్తి కాలేదు. రైతుల బాధలను ప్రభుత్వం పట్టించుకోవాలె. **- నర్సింహారెడ్డి, రైతు, టంగటూరు, శంకర్‌పల్లి మండలం**



ట్యాంకర్ వద్ద ఖాళీ బిందెలతో నిరీక్షిస్తున్న మహిళలు

**వారం రోజులుగా నిలిచిన మిషన్ భగీరథ నీటి సరఫరా**

**తరిగోపులలో దాహం..దాహం**

# పానీపాట్లు..

- పని చేయని చేతిపంపులు, బోరుబావులు
- పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా.. అయినా బిందెడు నీటి కోసం ట్యాంకర్ వద్ద యుద్ధమే..

ధారూరు, మే 17 : మండలంలోని తరిగోపుల వాసులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. గత ఆదివారం నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా గ్రామంలో నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పల్లెలో మిషన్ భగీరథ నీరు రాని సమయంలో చేతిపంపులు, బోరు బావుల నుంచి నీటిని అందించేవారు. అయితే బోరుమోటర్ కాలిపోవడంతో సమస్య తీవ్రమైంది. గ్రామంలో భూగర్భజలాలు అడుగంటడంతో బోర్లు వేసినా నీళ్లు పడడంలేదని స్థానికులు పేర్కొంటున్నారు. పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేసినా సరిపోవడం లేదని.. బిందెడు నీటి కోసం ట్యాంకర్ వద్ద యుద్ధం చేయా ల్సి వస్తున్నదని పలువురు మహిళలు పేర్కొంటున్నారు.

### సమస్య నిజమే..

గ్రామంలో నీటి సమస్య ఏర్పడింది నిజమే. గత కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు సరఫరా కాక నీటి ఎద్దడి ఏర్పడింది. ప్రత్నామ్నాయంగా ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశాం. సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

**-స్వప్న, పంచాయతీ కార్యదర్శి, తరిగోపుల**

గ్రామం పెద్దది కావడంతో ట్యాంకర్ నీరు సరిపోవడంలేదని.. నిరుపయోగంగా ఉన్న చేతిపంపులు, వాటర్ ట్యాంకులు, బోరుమోటర్లకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.





పని చేయని చేతిపంపు.. నిరుపయోగంగా ఉన్న ట్యాంక్

# సకాలంలో భరోసా అందేనా?

- వర్షాకాలం రైతుభరోసా కోసం ఎదురుచూస్తున్న అన్నదాత
- గత యాసంగిలో అతివృష్టి, అనావృష్టితో నష్టపోయిన రైతులు
- రంగారెడ్డి జిల్లాలో అర్హులు 3 లక్షల మంది



రంగారెడ్డి, మే 17 (నమస్తే తెలంగాణ) : గత యాసంగిలో అతివృ ష్టి, అనావృష్టితో తీవ్రంగా నష్టపోయిన జిల్లా రైతులు వానకాలంలో పంటల సాగు కోసం రైతు భరోసా పెట్టుబడి సాయంపై ఆశలు పెట్టుకున్నా రు. వర్షాకాల పంటల సాగు కోసం ఇప్పటికే జిల్లా వ్యవసాయాధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. సుమారు లక్ష ఎకరాలకు పైగా వరి సాగు కానున్నట్లు అంచనా వేశారు. ఈ పంట సాగుకు రైతుభరోసాను సకాలంలో అందించి ఆదుకోవాలని అన్నదాతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లేకుం టే పంట సాగులో తీవ్ర ఇబ్బంది పడుతామని పేర్కొంటున్నారు. గత యాసంగిలో అప్పులు తీసుకొచ్చి సాగు చేశామని.. ఆ అప్పులే ఇంకా తీరలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా గతం లో పెట్టుబడి సాయానికి చాలామంది రైతులు దూరమయ్యారు. మరోవైపు అతివృష్టి, అనావృష్టితో పెద్ద ఎత్తున నష్టపోయారు. ఈ యాసంగి పూర్తిగా రైతులను అప్పుల ఊబిలోకి నెట్టేసింది. పంట చేతికందే సమయంలో వడగండ్ల వాన, అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొన్నది.

### జిల్లాలో మూడులక్షల మంది..

జిల్లాలో సుమారు 3,00,000పైగా రైతులు రైతు భరోసాకు అర్హులుగా అధికారులు గుర్తించారు. వీరందరికి రైతుభరోసా కింద పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయాల్సి ఉండగా.. గత యాసంగిలో సగం మందికి మాత్రమే ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకొన్నది. ఈ వానకాలంలో సాగు విస్తీర్ణం కూడా పెరిగే అవకాశం ఉండడంతో.. అన్నదాతలు రైతుభరోసా ఎప్పుడు వస్తుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. వర్షాకాలంలో పొలం పను లు ప్రారంభం కాగానే పెట్టుబడి సాయాన్ని అం దించాలని కోరుతున్నారు. కానీ, ప్రభుత్వం ఇంకా భరోసాకు సంబంధించి ఎలాంటి ప్రకటన చేయలేదు. అదేవిధంగా పంట రుణాలు మాఫీ కాని వేలాది మంది రైతుల రుణాలను మాఫీ చేయాలని కోరుతున్నారు.

### భరోసా కోసం ఎదురుచూపులే..



కేసీఆర్ హయాంలో రైతుబంధు పంటల సాగుకు ముందే అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేది. కానీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతు భరోసా పెట్టుబడి సాయం కోసం ఏడాదిగా ఎదురు చూడాల్సి వస్తున్నది. గత యాసంగిలో కొద్దిమంది రైతులకు పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేసి.. మిగిలిన రైతులకు ఇప్పటికీ ఇవ్వలేదు. దీంతో చాలామంది వ్యాపారుల వద్ద వడ్డీకి తీసుకొచ్చి పంటలను సాగు చేశారు. రేవంత్ సర్కార్ అన్నదాతను ఇబ్బంది పెట్టకుండా.. అర్హులందరికీ రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని పంటల సాగుకు ముందే అందించి ఆదుకోవాలి. **-చిలుకల బుగ్గరాములు**

---

## అవగాహన పెరిగినా..
# అదుపేది?

నేడు 'ప్రపంచ హెచ్‌ఐవీ వ్యాక్సినేషన్ అవగాహన దినోత్సవం'





సిటీబ్యూరో, మే17 (నమస్తే తెలంగాణ): రక్తమార్పిడి, లైంగిక సమస్యల కారణంగా హెచ్ఐవీ బారిన పడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన కేసుల్లో ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే 16 శాతం ఉండడం గమనార్హం. దాదాపు 35-45 ఏండ్ల వయసులోని వారే హెచ్ఐవీతో బాధపడుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 'నేడు ప్రపంచ హెచ్ఐవీ వ్యాక్సినేషన్ అవగాహన దినోత్సవం' సందర్భంగా 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం..

### ఏడాదిలో 2506 మందికి పాజిటివ్..

హైదరాబాద్ జిల్లాలో హెచ్ఐవీ బాధితులు పెరుగుతూనే ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా హెచ్ఐవీ/ఎయిడ్స్ కేసుల్లో హైదరాబాద్ జిల్లా టాప్ టెన్‌లో ఉన్నది. గతేడాది మార్చి నుంచి ఈ ఏడాది మార్చి వరకు 1,27,200 మందికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించగా వాటిలో 2506 మందికి పాజిటివ్ వచ్చి వ్యాధి నిర్ధారణ అయింది. వారిలో 1550 మంది పురుషులే ఉన్నారు. అదేవిధంగా 43040 మంది గర్భిణులకు టెస్టులు చేయగా 115 మందికి పాజిటివ్ రావడం గమనార్హం. హైదరాబాద్ జిల్లాలో ఏఆర్‌టీ సెంటర్ ప్రారంభం నుంచి నేటి వరకు 28142 కి సేవలందిస్తుండగా వారిలో 10,357మంది హెచ్ఐవీ/ఎయిడ్స్‌తో మరణించారు.

### ఐసీటీ కేంద్రాలు..

గాంధీ జనరల్ ఆసుపత్రి, గాంధీ మెడికల్ కళాశాల, నిలోఫర్ ఆసుపత్రి, కింగ్‌కోటి జిల్లా ఆసుపత్రి, ఉస్మానియా జనరల్ ఆసుపత్రి, గోల్కొండ ఏరియా ఆసుపత్రి, మలక్‌పేట ఏరియా ఆసుపత్రి, నాంపల్లి ఏరియా ఆసుపత్రి, టీబీ అండ్ చెస్ట్ ఆసుపత్రి, పేట్లబుర్జ్ మెటర్నిటీ ఆసుపత్రి, శ్రీరాంనగర్ యూపీహెచ్‌సీ ఆసుపత్రుల్లోని ఐసీటీ కేంద్రాల్లో ఉచితంగా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహిస్తారు.

### అవగాహన అవసరం..

డాక్టర్ వెంకటి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, హైదరాబాద్ రోగం ముదరకుండానే కేసులను గుర్తించి ప్రత్యేక క్యాంపులు సైతం నిర్వహిస్తూ పరీక్షలు చేస్తున్నాం. ఐసీటీ కేంద్రాల్లో సైతం నిత్యం బాధితులకు పరీక్షలు నిర్వహిస్తూనే. మొదట్లోనే ఈ రోగం భారిన పడకుండా ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

# ఎడతెగని ఎలివేటెడ్

**జాయింట్ ప్రాజెక్టుతో టెక్నికల్ సమస్యలంటూ మెట్రో వాదన**

సిటీబ్యూరో, మే 17 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో మొట్టమొదటి ఎలివేటెడ్ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేపట్టిన ఈ ప్రాజెక్టు అసలు లక్ష్యం నీరుగారిపోయేలా ఉన్నది. ఒకే పిల్లర్‌పై రెండు రవాణా వ్యవస్థలను ఏర్పాటు చేయడం వల్ల నిర్మాణ భారం, స్థల సేకరణ వ్యయం తగ్గి, తక్కువ నష్టంతో ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయనే లక్ష్యంతో డబుల్ డెక్కర్ ప్రాజెక్టును హెచ్ఎండీఏ ప్రతిపాదించింది. అందుకు అనుగుణంగానే డబుల్ డెక్కర్ డిజైన్లు ఖరారు చేస్తే... ఇప్పుడే మెట్రో సంస్థ పెడుతున్న కొర్రీలతో ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. దీంతో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి ఏడాదైనా.. ఎలివేటెడ్ డిజైన్లు ఖరారు కాకుండానే కొట్టుమిట్టాడుతోంది. ఎలివేటెడ్ కారిడార్ ద్వారా ఒకేసారి రెండు రవాణా వ్యవస్థలను వచ్చేలా డిజైన్ చేశారు. కానీ తరచూ ఏర్పడుతున్న అడ్డంకులు ఆ ప్రాజెక్టు భవితను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. దీంతో దాదాపు 18 కిలోమీటర్ల పొడవైన డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు తమ ప్రాంతానికి వస్తుందో లేదోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

### సీఎం శంకుస్థాపన చేసిన తొలి ప్రాజెక్టు...

రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత భారీ బహిరంగ సభతో శంకుస్థాపన చేసిన మొట్టమొదటి ప్రాజెక్టు ఇదే. దీనికి అల్వాల్ టిమ్స్ వేదికగా ఏర్పాటు చేసిన సమావేశంలోనే పునాది వేశారు. కానీ ఇప్పటికీ ఆ ప్రాజెక్టుకు అవసరమైన డిజైన్లు మాత్రం కొలిక్కి రాలేదు. నిజానికి ఈ ప్రాజెక్టు డిజైన్లను బీఆర్ఎస్ ఖరారు చేసింది. కొన్ని మార్పులతోనే ప్రాజెక్టును పట్టాలెక్కించేలా ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే మొదలైన ఇబ్బందులు.. ఇప్పటికీ ఎడతెగని ముచ్చటగానే మారుతున్నది.

### డబుల్ డెక్కర్‌పై మెట్రో నడవదా?

పుణె తరహాలో చేపట్టిన డబుల్ డెక్కర్ ప్రాజెక్టుకు డిజైన్ చేశారు. అక్కడ ఒక అంతస్తులో రోడ్డు, రెండో అంతస్తులో మెట్రో నిర్వహిస్తున్నారు. ఇక్కడ కూడా అదే తరహాలో డబుల్ డెక్కర్‌ను నిర్మించి పై అంతస్తులో మెట్రోను నడిపించేలా డిజైన్ చేశారు. కానీ ఈ ప్రాజెక్టు ద్వారా మెట్రో నిర్వహణ అసాధ్యమని, ఎన్నో సాంకేతిక సమస్యలు వస్తాయని లేవనెత్తిన అంశాలు ప్రాజెక్టు ప్రణాళికలను కాలరాసేలా ఉన్నాయి.